


**దేశంలో ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్నది. వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల నుంచి రెడీ టు ఈట్ ఫుడ్ వరకూ వస్తువుల అమ్మకాలు వృద్ధి చెందుతున్నాయి. తమను తాము అప్‌డేట్ చేసుకోని సంస్థలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టగలిగిన వారే వ్యాపారంలో రాణిస్తున్నారు. అలాగే మొబైల్ ఫోన్ల వాడకం, ఇంటర్‌నెట్ విజృంభణ లాంటి వాటివల్ల ఇ-కామర్స్ రంగం విపణిలో దూసుకుపోతున్నది. కొత్త యాప్‌ల సృష్టికి వీలు కల్పిస్తున్నది. ఎఫ్‌ఎమ్‌సీజీ, డీ2సీ, ఫిన్‌టెక్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో యువ పారిశ్రామికవేత్తల విజయాలు అబ్బురపరిచే స్థాయిలో ఉన్నాయి.**



ఈ స్టార్టప్ ఎకో సిస్టమ్‌లో పెట్టుబడులను సమీకరించటం ఒక సవాలు. ఇన్వెస్టర్ల సెంటిమెంట్లు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని యువ పారిశ్రామికవేత్తలు వేగంగా అడుగులు వేస్తున్నారు. ఓటమిని పాఠాలుగా, అవరోధాలను అవకాశాలుగా మలుచుకుంటూ వ్యాపారానికి కొత్త రెక్కలు తొడుగుతున్నారు. దేశ, విదేశాల్లో మెరుపులు మెరిపిస్తున్నారు. భారతీయ పాల ఉత్పత్తుల పరిశ్రమల రంగంలో పరాగ్ మిల్క్ ఫుడ్స్ లాంటి సంస్థలు సాధిస్తున్న విజయాలు అబ్బురపరిచేలా ఉన్నాయి.

ఇక చంటిపిల్లల సంరక్షణ కోసం ఎన్నో కొత్త ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. అందులో డైపర్స్‌కు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులు మార్కెట్లో ఎప్పటినుంచో ఉన్నవాటిని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త బ్రాండ్స్ కోసం చూస్తున్నారు. ఎక్కువ రీసెర్చ్ చేస్తున్నారు. ఒకప్పుడు మహానగరాల్లోనే పిల్లలకు డైపర్ల వాడకం ఎక్కువగా కనిపిస్తే ఇప్పుడు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ వీటి వాడకం పెరిగింది. దాంతో ప్రస్తుత డైపర్స్ మార్కెట్ 1.6 అమెరికన్ బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది 2032 నాటికి 3 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ఇక్కడ ఉండే మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని చాలా మంది ఔత్సాహికులు ఈ రంగంలోకి వస్తున్నారు. ఈ క్రమంలో ఎకో ఫ్రెండ్లీ డైపర్స్ వంటివీ వచ్చిచేరుతున్నాయి. 'ఆల్టర్' బ్రాండ్ భారతదేశంలో మొట్టమొదటి సస్టెయినబుల్, రాష్ ఫ్రీ డైపర్లను విడుదల చేసింది.

## సాంకేతికత తోడుగా

దేశం మొత్తం డిజిటల్ కోర్టు రూమ్‌లను దర్శించడానికి మనం ఇక ఎన్నో రోజులు ఎదురుచూడనవసరం లేదనిపిస్తున్నది. చట్టానికి, సాంకేతికత తోడై న్యాయవ్యవస్థలో సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తున్నది. న్యాయవ్యవస్థను ప్రస్తుతం పీడిస్తున్న అనేక సమస్యల్లో కేసుల పరిష్కారంలో అపరిమితమైన జాప్యం ఒకటి. దీనివల్ల పేద వర్గాలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. న్యాయమూర్తులు, న్యాయవాదులపైన భారం పడుతున్నది. ఈ సమస్యకు అదాలత్ ఏఐ చక్కని పరిష్కారం చూపుతున్నది. కేసుల సత్వర పరిష్కారానికి, వేగంగా న్యాయం అందటానికి దోహదం చేస్తున్నది. ఇప్పటికే ఢిల్లీ, కర్నాటకల్లో హైకోర్టులు, కొన్ని జిల్లా కోర్టుల్లో దీన్ని ఉపయోగిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కోర్టులు దీని సేవలు అందిపుచ్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఎకో ఫ్రెండ్లీ బేబీ డైపర్స్

2020లో ఢిల్లీకి చెందిన సురభి రిటైల్ హెల్త్, పర్సనల్ కేర్ బ్రాండ్‌గా 'ఆల్టర్' ను ప్రారంభించారు. చంటిపిల్లలకు ప్రస్తుతం మార్కెట్లో దొరికే డైపర్స్‌కి భిన్నమైన కొత్త ఉత్పత్తిని మార్కెట్‌లోకి తెచ్చారు. ఈ డైపర్ చిన్నారుల సున్నితమైన చర్మానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తుంది. భారతదేశపు మొట్టమొదటి రాష్ ఫ్రీ డైపర్ అని సంస్థ ప్రకటించింది. ఇది సూపర్ హిట్ అయ్యింది. ప్రారంభించిన తక్కువ కాలంలో లాభాల పట్టాలు ఎక్కింది. అంతేకాదు గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగేందుకు ప్రయత్నాలు చేపట్టింది. ''సంస్థ ప్రారంభించినప్పటి నుంచి యేటా రెట్టింపు పెరుగుతూ వచ్చాం. 2024 చివరినాటికి నికర ఆదాయం రూ.25 కోట్లు ఉండాలనే లక్ష్యంతో పనిచేశాం. అలాగే ఆఫ్‌లైన్ మార్కెట్లో దూకుడుగా వెళుతున్నాం. యూఏఈ, సింగపూర్ లాంటి విదేశీ మార్కెట్లపైన దృష్టి పెట్టాం'' అని చెబుతున్నారు సురభి. షార్క్ ట్యాంక్ ఇండియా ఈ వెంచర్‌లో పెట్టుబడి పెట్టింది. ఆల్టర్ రూపొందించిన ప్యాంట్ మోడల్ డైపర్‌ని 'అమెజాన్ చాయిస్'గా పేర్కొంది. దీనికి అంతర్జాతీయంగా కూడా డిమాండ్ వచ్చింది.

• **సురభి బఫ్నా గుప్తా,**
ఫౌండర్ సీఈఓ, ఆల్టర్

